

# ముఖ్యమంత్రి సభ స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)

సెప్టెంబర్ 30వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తో కలిసి సభ నిర్వహించే ప్రదేశాన్ని, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.

మిగతా 2 లో



ఆదివారం 27 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:15

# ముఖ్యమంత్రి కన్ను సిరిసిల్ల మీద పడింది

# మీ పంట పండింది

## - మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు









రాజన్న సిరిసిల్ల ప్రతినిధి సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు అనంతరం సభ స్థలాన్ని పరిశీలించారు ముఖ్యమంత్రి సభను సమష్టిగా విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారుసెప్టెంబర్ 30న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలో మణికంఠ గార్డెన్స్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అతిథులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిట శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయరమణారావు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి లు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ప్రశంసించారు. పట్టుదలతో పనిచేసే నాయకుడిగా, మంచి స్వభావం కలిగిన వ్యక్తిగా ఆది శ్రీనివాస్‌కు ప్రజల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. శాసనసభలో ముఖ్యమంత్రి తర్వాత ఆది శ్రీనివాస్ చెప్పే అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు.సిరిసిల్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, సీఎం సిరిసిల్లను సభా వేదికగా ఎంచుకోవడాన్ని కార్యకర్తలు అర్థం చేసుకోవాలని తుమ్మల అన్నారు. ఈ సభ రాష్ట్ర, దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై నమోదైన కక్షపూరిత కేసుల అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడటం, వారి సంక్షేమానికి అండగా నిలవడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం మిగిల్చిన బకాయిలను చెల్లిస్తూ, రైతులు, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

మిగతా 2 లో

# ముఖ్యమంత్రి కన్ను సిరిసిల్ల మీద పడింది మీ పంట పండింది

మొదటిపేజీ తరువాయి

సిరిసిల్ల చేనేత రంగానికి యారన్ డిపో ఏర్పాటు చేయడంతో పాటు నేతన్నలకు సంబంధించిన రుణభారాన్ని తగ్గించే చర్యలు చేపట్టామని తెలిపారు.వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి కూడా ఆది శ్రీనివాస్ కోరుకున్న మేరకు ముందుకు సాగుతోందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని తుమ్మల పేర్కొన్నారు.దేశ రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణ భారతదేశంపై రాజకీయంగా విస్తరించేందుకు ప్రయత్నిస్తోందని తుమ్మల విమర్శించారు. ఆర్థిక సమస్యలు, కేంద్రం నుంచి ఎదురవుతున్న ఇబ్బందుల మధ్య కూడా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు.సిరిసిల్లలో ఏ సమస్య ఉన్నా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని పేర్కొన్నారు.సెప్టెంబర్ 30న జరిగే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్లను సభా వేదికగా ఎంచుకోవడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని అర్థం చేసుకుని సభను విజయవంతం చేయాలని కోరారు.కాగా, సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ సభకు లక్ష మంది వరకు సమీకరించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నట్లు ఇప్పటికే పార్టీ వర్గాలు ప్రకటించాయి.

### మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ

ఈ నెల 30న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను కాంగ్రెస్ శ్రేణులంతా సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. సభకు జనసమీకరణ విషయంలో ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.గత ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై అడ్డగోలుగా కేసులు పెట్టిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కూడా అనేక కేసులు నమోదు చేసిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్ల నియోజకవర్గంలో సుమారు రూ.1,000 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని శ్రీధర్‌బాబు తెలిపారు. భవిష్యత్‌లో సిరిసిల్ల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.కేటీఆర్ గతంలో అనేక హామీలు ఇచ్చి పలువురిని బీఆర్ఎస్‌లోకి తీసుకెళ్లారని, అక్కడ ఆశించిన ఫలితాలు లేక తిరిగి వచ్చిన వారు ఉన్నారని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు రుణమాఫీ, పంటలకు మద్దతు ధర, కొత్త రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు.పార్టీలో పదవుల కోసం ప్రతి ఒక్కరికీ ఆశ ఉండటం సహజమేనని, అయితే పదవులు పరిమితంగా ఉంటాయని, అందరూ పార్టీ బలోపేతానికి పనిచేయాలని శ్రీధర్‌బాబు సూచించారు.వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి విషయంలో గతంలో కేసీఆర్ పలుమార్లు వచ్చి హామీలు ఇచ్చారని, అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకసారి వచ్చి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు కూడా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని, ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తికాకముందే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని శ్రీధర్‌బాబు విమర్శించారు. దానం నాగేందర్ అంశంపై కేటీఆర్ మాట్లాడటాన్ని ప్రస్తావిస్తూ.. ఆ విషయంపై కేటీఆర్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు కేటీఆర్, హరీశ్‌రావు, కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల్లోని ప్రజలకు కూడా అందుతున్నాయని శ్రీధర్‌బాబు తెలిపారు.సెప్టెంబర్ 30న సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగే సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభకు పెద్దఎత్తున ప్రజలను తరలించేలా గ్రామస్థాయి నుంచి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కోరారు.అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను సభకు తరలించాలని ఆయన సూచించారు.సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే లేకపోవడంతో గతంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొన్నారు. అనేక ఇబ్బందులు ఎదురైనా పార్టీ కోసం కార్యకర్తలు అంకితభావంతో పనిచేశారని అన్నారు.తాను కూడా సామాన్య కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో పనిచేసి నేడు ఎమ్మెల్యేగా ఉన్నానంటే అందుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే ఉండాల్సిన అవసరం ఉందని, అందుకోసం కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.ఈ నెల 30న జరగనున్న సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు సిరిసిల్ల నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణ చేసి సభను విజయవంతం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు..పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన కరీంనగర్ జిల్లాలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.అనంతరం ముఖ్యమంత్రి సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, భారీ బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. 33 నెలల ప్రజాపాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సభ ద్వారా ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామిక ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ మనస్ఫూర్తిగా ఆహ్వానం పలికారు. "చలో సిరిసిల్ల" పేరుతో నిర్వహించే కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# ముఖ్యమంత్రి సభ స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్

మొదటిపేజీ తరువాయి

అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు హాజరయ్యే క్రమంలో పట్టణంలోకి ప్రవేశించే మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.ప్రత్యేకంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, చంద్రంపేట చౌరస్తా ప్రాంతాలను పరిశీలించి, ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.భారీ సంఖ్యలో ప్రజలు సభకు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పార్కింగ్, ట్రాఫిక్, భద్రత, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు..



# పశువైద్యశాల.. మందుబాబుల అడ్డా


## - ఆవరణలో దర్శనమిచ్చిన మద్యం బాటిళ్లు

**కొడిమ్యాల,సెప్టెంబర్ 26,(ప్రజాజ్యోతి):** మండలంలోని డబ్బు తిమ్మాయపల్లి పశువైద్యశాల ఆవరణలో మద్యం బాటిళ్లు దర్శనమిచ్చాయి. పశువులకు వైద్య సేవలు అందించాల్సిన ప్రాంగణంలో మద్యం బాటిళ్లు దర్శనమివ్వడం చర్చనీయాంశంగా మారింది. వైద్యశాల ఆవరణను కొందరు మద్యం సేవించేందుకు వినియోగిస్తున్నట్లుగా అక్కడ కనిపిస్తున్న పరిస్థితులు తెలియ జేస్తున్నాయి. వైద్యశాల పరిసరాల్లో ఇలాంటి కార్యకలాపాలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరు తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రాంగణంలో అనధికారికంగా ఎవరూ ప్రవేశించకుండా పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పశువైద్యాధికారి కమలాకర్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు దృష్టి సారించి పశువైద్యశాల పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# గణేష్ నిమజ్జనంలో ఘర్షణ.. కేసులు నమోదు

**కొడిమ్యాల,సెప్టెంబర్ 26,(ప్రజాజ్యోతి):** గణేష్ నిమజ్జనం సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో చోటుచేసుకున్న రెండు ఘటనలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో నిమజ్జన ఊరేగింపు సమయంలో గడ్డం లక్ష్మారెడ్డి, గడ్డం నరేందర్‌రెడ్డి మరికొందరు ఊరేగింపును అడ్డుకుని రాళ్లు రువ్వినట్లు, ఈ ఘటనలో కొందరికి గాయాలు కాగా, కారు దెబ్బతిన్నట్లు ఏనుగు నరసింహారెడ్డి ఫిర్యాదు చేయడం జరిగిందని, మరో ఘటనలో ఇంటి ముందు నిమజ్జన ఊరేగింపులో పెద్ద శబ్దంతో సంగీతం పెట్టడంతో శబ్దం తగ్గించాలని కోరినందుకు తనను, కుటుంబ సభ్యులను దుర్భాషలాడి, కారు, ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసినట్లు గడ్డం సౌజన్య ఫిర్యాదు మేరకు ఏనుగు నరసింహారెడ్డి, నాయిని రాజు, గడ్డం వంశీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# చందుర్తిలో ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

## రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

**వేములవాడ,సెప్టెంబర్,26:ప్రజాజ్యోతి.**

చందుర్తి మండల కేంద్రంలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల రజక సంఘం అధ్యక్షుడు సుద్దాల నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన కృషిని పలువురు నాయకులు కొనియాడారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం జనరల్ సెక్రటరీ వనపర్తి సతీష్, క్యాషియర్ కొడగంటి గంగాధర్, మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమా, బీసీ సంక్షేమ సంఘం సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరశు రాం, చందుర్తి సర్పంచ్ పులి సత్యం, మాజీ సర్పంచ్ సిరికొండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిలకపెంటయ్య, తిప్పని శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ చిర్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.అలాగే రజక సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు లింగంపల్లి కొండయ్య, లింగంపల్లి మల్లయ్య, లింగంపల్లి బాలయ్య, లింగంపల్లి దేవరాజు, లింగంపల్లి మహేష్, లింగంపల్లి హరీష్, సుద్దాల రాంప్రసాద్, లింగంపల్లి రాజు, శ్రీకాంత్, లింగంపల్లి సాగర్, లింగంపల్లి గంగరాజు, ఎడపల్లి సాయి, లింగంపల్లి శ్రీనివాస్, హరిబాబు, లింగంపల్లి గణేష్, లింగంపల్లి చరణ్, లింగంపల్లి సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## బదనకల్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**ముస్తాబాద్: సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలో రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, క్యాషియర్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ముస్తాబాద్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు చిగురు నరేష్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ చూపిన పోరాటపటిమ, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకుని రజక సమాజం ఐకమత్యంతో ముందుకు సాగాలని, తమ హక్కుల సాధనతో పాటు గ్రామాభివృద్ధి, దేశ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## ముస్తాబాద్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలుఐలమ్మ స్ఫూర్తితో రజకుల సంక్షేమానికి కృషి చేయాలి

**ముస్తాబాద్, సెప్టెంబర్ 26:**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ముస్తాబాద్ మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షులు సుద్దాల దేవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముస్తాబాద్ ఎస్సై జ్యోతి హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప యోధురాలు ఆమె అని పేర్కొన్నారు. ఐలమ్మ త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని, ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని, రజక వృత్తిదారుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ సర్పంచ్, ముస్తాబాద్ ఎస్సై జ్యోతి, వివిధ గ్రామాల రజక సంఘాల అధ్యక్షులు, మండల రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, యువకులు, రజక సంఘం సోదరులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రేణికుంటలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఎలుక అంజనేయులు ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు,చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎలుక అంజనేయులు మాట్లాడుతూ, భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల తెగువను,పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కనికచాకలి ఐలమ్మ అని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు.అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సమాజంలో సమానత్వం, ఆత్మ గౌరవం, హక్కుల సాధన కోసం చాకలి ఐలమ్మ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ ఎలుక అంజ నేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక అంజనేయులు మాజీ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి వార్డు సభ్యులు బోయినిశంకరయ్య,పోతుగంటి అనిల్ బావండ్ల ప్రవీణ్, కనపర్తి చంద్రశేఖర్,మాజీ ఉపసర్పంచ్ కుంభం శ్రీనివాస్,రజక సంఘం అధ్యక్షులు పోతుగంటి సంపత్ ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీకాంత్, రమేష్ తిరుపతి రాజయ్య, తిర్మలయ్యా, నాయకులు బావండ్ల రాజయ్య,కనపర్తి బస్వరాజు, బొంగాని సురేష్,ఎం.డి ఫిరోజ్, కొమురయ్య పంచాయతీ సిబ్బంది,గ్రామ పెద్దలు,యువత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.



## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**చొప్పదండి, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):**

వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా చొప్పదండి మండల రజక సంఘం అధ్యక్షుడు మావురపు రాములు ఆద్వర్యం లో స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం రజక యువజన సంఘం అధ్యక్షుడు నిజానపురం చందు ఆద్వర్యం లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం అధ్యక్షుడు నిజానపురం చందు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్రగామిగా నిలిచిన వీరనారి ఐలమ్మ బహుజన ఆత్మగౌరవ ప్రతీక అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నవాబు, రజాకార్లు, స్థానిక భూస్వాములకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం దేశ చరిత్రలోనే అపూర్వమైందని చెప్పారు. పోరాట కాలం లో ఆమె ఇల్లు పోరాట యోధులకు, విప్లవ కారులకు ప్రధాన కేంద్రంగా ఆశ్రయాన్ని ఐలమ్మ కల్పించారని పేర్కొన్నారు. దొరల దౌర్జన్యానికి లొంగకుండా ప్రాణాన్ని అయిన ఇస్తా కానీ కష్టాన్ని, భూమి నీ వదులుకోనని చెప్పిన గొప్ప వీరవనిత అని కొనియాడారు. కార్యక్రమం లో రజక సంఘం నాయకులు ఎడవెల్లి రాజారాం,దొంతరవేణి సంపత్, రజక సంఘం పట్టణ అధ్యక్షులు పొన్నాల శంకరయ్య, శంబయ్య, అర్థవెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలం

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి:)**



రైతుల సాగునీటి సమస్యకు కీలకమైన 9వ ప్యాకేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేయలేకపోయిందని ఆయన విమర్శించారు.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా పనులు పూర్తికాకపోవడం రైతుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిమ్మాపూర్‌లో 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదని విమర్శించారు.హామీలు కాదు.. పనులు కావాలి.. రైతులకు సాగునీరు కావాలి అని పొన్నాల తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. 9వ ప్యాకేజీ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 28న వీర్నపల్లి మండలంలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి సిరిసిల్ల జిల్లాకు రానున్న నేపథ్యంలో 9వ ప్యాకేజీ పనుల అంశాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పనులు ప్రారంభించకపోతే రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, నాయకులు ఉడుగుల యాదగిరి, మద్దుల బుగ్గారెడ్డి, కిరణ్ నాయక్, దాసరి గణేష్, చందుపట్ల లక్ష్మారెడ్డి, శరత్‌రెడ్డి, ప్రకాష్, రంజిత్, సంజీవరెడ్డి, బాలగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, బాలకృష్ణ, దయాకర్‌రెడ్డి, నవీన్, తిరుపతి, నాగరాజు, లక్ష్మణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ లో చేరికలపై బెదిరింపులకు పాల్పడొద్దు ఇష్టమున్న పార్టీలో ప్రజలకు చేరే హక్కు ఉంటుంది - సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**



రాజన్న సిరిసిల్ల నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో స్వచ్ఛందంగా ప్రజలు చేరుతుండగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కొంతమంది నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరిన కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల, వీర్నపల్లి మండలం కేంద్రంతో పాటు బాబాయ్ చెరువు తండా, గర్జనపల్లి గ్రామాలలో శనివారం వందల సంఖ్యలో సిరిసిల్ల నియోజకవర్గ మహిళా ఇన్చార్జ్ కదిరే రేణుక, వీర్నపల్లి మండల మహిళా ఇన్చార్జ్ పోతారం పద్మ, సల్మాల ముత్తవ్వ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీలో స్వచ్ఛందంగా మహిళలు, యువతి, యువకులు భారీ సంఖ్యలో చేరుతుండడంతో ఇతర పార్టీల కొంతమంది నాయకులు బెదిరింపులకు గురి చేయడం జరుగుతుందన్నారు. బెదిరింపులకు చేయడం సరైనది కాదని, ఏ పార్టీలోనైనా చేరే హక్కు ప్రజలకు ఉంటుందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాలలో టిఆర్ఎస్ అధినేత కవితక్క చేస్తున్న ప్రజాసేవకు రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పట్టడం జరుగుతుందన్నారు. కవితక్క ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తుండడంతో టిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నాయన్నారు. పార్టీ అభివృద్ధిని ఓర్చుకోలేని ఇతర పార్టీ నాయకులు కొంతమంది పార్టీలో చేరిన వారిని బిఆర్ఎస్ నాయకులు కొంతమంది మేము డబుల్ బెడ్ రూమ్ లో కట్టి ఇచ్చాం, పెన్షన్లు ఇచ్చాం టిఆర్ఎస్ లో ఎందుకు చేరుతున్నారని బెదిరిస్తున్నారని, అధికార కాంగ్రెస్ పార్టీ వాళ్లు మీకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు బిల్లులు ఇవ్వమని, మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు కొట్టి వేయిస్తామని, పెన్షన్లు రద్దు చేస్తామని బెదిరించడం హేయమైన చర్య అన్నారు. ప్రజల హక్కును బలవంతంగా, బెదిరింపులకు గురి చేస్తూ పార్టీలో చేరకుండా చేస్తున్న నాయకులు ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలని లేనిచో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ యువజన నాయకుడు సయ్యద్ జావిద్, మార్వాడి దేవరాజు, బండి శ్రీహరి, కోనేటి పర్షయ్య, కొడుముంజ బాబు, మంతారం పద్మ, జంగా రజిత, బానోతు జ్యోతి, కదిరే చరణ్ , హరాలే సిద్ధూ పాల్గొన్నారు.

# భూముల రీసర్వేతో సమస్యలకు పరిష్కారం - తహసిల్దార్ డి.శ్రీనివాస్

**ధర్మారం, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి న్యూస్):**



శాయంపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ కూస శ్రావణి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సమావేశంలో శాయంపేట గ్రామంలో భూ భారతి రీ సర్వే పై గ్రామ ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్వే ఏడీ సోమేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని భూములకు సంబంధించిన సమస్యలను రీసర్వే ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. రీసర్వే ప్రక్రియకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు.కార్యక్రమంలో గిర్దావర్ నవీన్‌రావు, మండల సర్వేయర్ శ్రీనివాస్, జీపీఓ రమణ, లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు. ఉపసర్పంచ్ దయ్యాల రజిత రాకేష్, పంచాయతీ కార్యదర్శి సంధ్య, వార్డు సభ్యులు చేనెల్లి సత్తయ్య, ఆకునూరి మల్లేష్, బొమ్మగాని సాక్షిత మహేష్, ఐలవేని కనకమ్మ అంజయ్య, కాంపెల్లి ఎషమ్మ, పబ్బతి స్వామి, కాంపెల్లి కిష్టయ్య, అంగన్‌వాడీ టీచర్ బద్దం భాగ్య, ఆశా వర్కర్ పద్మతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో స్టార్ యూత్ గణనాథుడి శోభాయాత్ర

**ముస్తాబాద్: సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి):**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో స్టార్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడు నవరాత్రుల పాటు విశేష పూజలు అందుకున్న అనంతరం శనివారం నిమజ్జనానికి తరలించారు.ఈ సందర్భంగా భక్తులు గణనాథునికి మంగళహారతులు సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ వేషధారణలతో నరసింహస్వామి, ఎలుగుబంటి తదితర రూపాల్లో యువత పాల్గొనగా, గణనాథుని శోభాయాత్ర భక్తి పారవశ్యంతో కొనసాగింది. డప్పుల మోతలు, భక్తుల నినాదాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.స్టార్ యూత్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.



# ఎల్లారెడ్డిపేటలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్ లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఫోటోలకు పూల మాలలు సమర్పించి వారిలో మాజీ జెడ్పిటిసి సభ్యులు చిట్టి లక్ష్మణరావు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి సుభాష్ మీసంరాజం నరసింహులు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



# దూళి కట్టలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు.....

**ఎలిగేడు సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి)**

ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామంలో గ్రామపంచాయతీ ఆఫీసులో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గ్రామ సర్పంచ్ మారం కొమురయ్య యాదవ్ ఘనంగా నిర్వహించి ఫోటోలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మహిళా చైతన్యానికి, ఆత్మ గౌరవానికి చాకలి ఐలమ్మ ప్రతీక అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయితో పోరాట యోధురాలు అని కొనియాడారు ఆనాటి నిరంకుశ రజాకార్ల దేశముకులను వ్యతిరేకంగా మొక్కవోని ధైర్యంతో ఐలమ్మ ఎదిరించిన తీరు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# కొలనూరు ప్యాక్స్ డైరెక్టర్గా ఉప్పుల గంగయ్య

## - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆశీస్సులతో

## నియామకం వెల్లువెత్తిన శుభాకాంక్షలు

**కోనరావుపేట,సెప్టెంబర్.26 (ప్రజాజ్యోతి)**

కొనరావుపేట మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల గంగయ్య ను ఘనంగా సన్మానించారు.గంగయ్య ను కొలనూర్ సింగిల్ విండో డైరెక్టర్గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డు మిత్రులు యువకులు రైతులు, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. రైతుల సంక్షేమం కోసం సహకార సంఘ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు డైరెక్టర్గా నియామకం పట్ల గ్రామంలోని రైతులు యువకులు వర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



# చిన్నకలువల సహకార సంఘం అభివృద్ధికి కృషి

## చైర్మన్ గౌరవెల్లి మురళీధర్‌రావు

**సుల్తానాబాద్ సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి) :**

చిన్నకలువల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ శనివారం చైర్మన్ గౌరవెల్లి మురళీధర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.సంఘ కార్యదర్శి వి.రమేష్ 2025 , 26 ఆడిట్ నివేదిక, జమా ఖర్చులు, ఆస్తులు , అప్పులు, రుణాలు, వసూళ్ల శాతం తదితర వివరాలను సభలో చదివి వినిపించగా సభ్యులు ఆమోదించారు. గత పాలకవర్గాల కృషితో గోదాములు, పెట్రోల్ పంపు ఏర్పాటు జరిగాయని అతిథులు పేర్కొన్నారు.ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆశీస్సులతో రైతులకు మరింత సేవలందిస్తామని చైర్మన్ మురళీధర్‌రావు తెలిపారు. చిన్నకలువలలో డీసీసీబీ సహకారంతో ఫంక్షన్‌హాల్, గోల్డ్‌లోన్ లాకర్ సౌకర్యం, చిన్నబొంకూరులో మినీ మిల్క్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం చైర్మన్, పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు, వ్యవసాయ అధికారులు, సర్పంచులు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.





# భీమేశ్వర అలయంవద్ద 200 మంది భక్తులకు అన్నదానంతో పాటు స్వీట్ల పంపిణీ

## - అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్





**వేములవాడ,సెప్టెంబర్,26:ప్రజాజ్యోతి.**

ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1995 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం లో భాగంగా శని వారం రోజున భీమేశ్వర వద్ద పేదలకు అన్నదాంతో పాటు స్వీట్ల పంపిణీ కార్య క్రమం నిర్వహించడంజరిగిందనిఅన్నారు... నేటిఅన్నాదాతలుగా బొడ్డు ప్రేమ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా వీరి సతీమణి హారిక గడ్డం, కూతురు సాన్వి, కుమారుడు సుజయ్ కార్తీక్ బొడ్డు గార్లు, జనగామ లక్ష్మి గారి జ్ఞాపకార్థం వీరి కుమారు లు జనగామ శేఖర్ శ్రీకాంత్ తిరుమలఅన్నదానం చేశారు..మీ పుట్టినరోజు పెళ్ళిరోజు ఇతరత్ర కార్యక్రమా లకు పేదలకు అన్నార్తులకు ఒక్క పూట అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను గాని ట్రస్ట్ నంబరు 9246939388కు సంప్రదించా లని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు.అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్ అజయ్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని కరోనా కష్టకాలం నుండి దాతల సహ కారంతో ప్రతిరోజు ఎండనకా వాననక పేదలకు అన్నదాన కార్యక్రమాలే కాకుండా ఆపదలోఉన్నవారిని ఆదుకోవడంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ముందుంటారని అంతే కాకుండా ఇన్ని రోజులుగా ఓపికగా సేవలు అందిస్తున్న సభ్యులను అభినందిస్తూ ఈ ట్రస్టులో నేను కూడా ఒక సభ్యుడిగా ఉండడం నాకు గర్వంగా ఉందన్నారు.నేటి కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ సగ్గు రాహుల్ పసుల శ్రీధర్ గొండ ప్రసాద్ మధు కవిత గొట్టం శ్రీనివాస్ ముఖ్యఅతిథి ఇప్పపూల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయస్వామి ఆలయంలో ఘనంగా అన్నదానం

## - భక్తి శ్రద్ధలతో ప్రత్యేకపూజలు.. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు





**వేములవాడ,సెప్టెంబర్,26:ప్రజాజ్యోతి.**

పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాత్రేయ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించి, పూజలు నిర్వహించి అర్చకుల ఆశీర్వాదాలు పొందారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నదానం వడ్డించారు.ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమైన కార్యక్రమమని అన్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ఆధ్యాత్మిక భావనతో పాటు మానవతా విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఆలయాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో పరస్పర సహకారం, సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని ఆయన అన్నారు. పౌర్ణమి వంటి పవిత్రమైన రోజుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం సంతోషకరమని తెలిపారు.అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు భోజన వసతి కల్పించారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి ఆలయ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, భక్తులు, స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూమి.. భుక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

## చాకలి ఐలమ్మకు మంత్రుల ఘన నివాళి



**కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు చిరస్మరణీయమని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.దొరల పాలన, వెట్టి చాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని మంత్రులు పేర్కొన్నారు. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. యువత ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య తదితరులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

## తెలంగాణ తొలి భూపోరాట వీరనారి,ఆత్మగౌరవ ప్రతీక.. చాకలి ఐలమ్మ

### విక్కుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు

**వేములవాడ,సెప్టెంబర్,26:ప్రజాజ్యోతి.**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, పోలీసులను, దేశ్ ముఖ్ లను ఎదిరించి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో తన పేరును లిఖించుకున్న వీరమాత చాకలి ఐలమ్మ 131 వ, జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ " భూమికోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం అని కమ్యూనిస్టులు చెప్పే సిద్ధాంతం కులవృత్తి చేసుకునే ఐలమ్మ ద్వారా ఉద్భవించిందనేది జగమెరిగిన సత్యమని, స్త్రీలంటే చిన్న చూపు చూసేవారందరికీ చాకలి ఐలమ్మ పోరాటం కనువిప్పు కలిగించిందని, వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామం లో 1895, సెప్టెంబర్ 26న రజక కుటుంబంలో ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు ఐలమ్మ జన్మించిందని, కులవృత్తితో జీవనం సాగించలేక ఆర్థిక ఇబ్బందుల కారణంగా వ్యవసాయం చేయాలని ఐలమ్మ కుటుంబం నిర్ణయించుకుందని, మల్లంపల్లి భూస్వామి వద్ద 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సేద్యం చేయడం ప్రారంభించారని, ఇది నచ్చని పోలీస్ పటేల్ శేషగిరిరావు తన పొలంలో పని చేయమని ఒత్తిడి తెచ్చారని, అందుకు ఐలమ్మ నిరాకరించడం తో పటేల్, విస్నూరు దేశ్ ముఖ్ రామచంద్ర రెడ్డికి ఫిర్యాదు చేశాడని, పటేల్ శేషగిరిరావు, దేశ్ ముఖ్ రామచంద్రారెడ్డి, ఐలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బకొట్టి లొంగదీసుకోవాలని కుట్ర చేశారని, పోలీస్ పటేల్ సాయంతో రామచంద్రారెడ్డి భూమిని తన పేరు మీద రాయించుకొని భూమి తనదేనని, తన భూమిలో పండించిన ధాన్యాన్ని తీసుకపోవడానికి గూండాలను ఐలమ్మ భూమి లోకి పంపాడని, దీనితో ఆగ్రహించిన ఐలమ్మ, రామచంద్రారెడ్డి పంపిన గూండాలపై రోకలిబండ చేత పట్టుకొని గూండాలను తరిమి కొట్టిందని, చాకలి ఐలమ్మ రామచంద్రారెడ్డి పై చేసిన తిరుగుబాటు తెలంగాణ ప్రజలకు ఉద్యమస్ఫూర్తిగా నిలిచిందని, ఈ భూపోరాటం మొదలై, సాయుధ పోరాటానికి దారితీసిందని, నిజాం తొత్తులుగా



ఉన్న వారి వద్ద నుంచి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచడం జరిగిందని, ఈ సంఘటన తర్వాతే 'భూమికోసం, ముక్తి కోసం, పేదల విముక్తి కోసం' అనే నినాదం ఐలమ్మ ద్వారా ఉద్భవించిందని, ఉత్పత్తి కులంలో పుట్టిన చాకలి ఐలమ్మ ధైర్యంగా విస్నూరు దేశ్ ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి పై చేసిన భూ పోరాటం తెలంగాణ చరిత్రలో మరిచిపోలేని సంఘటనగా నిలిచిపోయిందని, భూస్వామ్య వ్యవస్థలోని ఓ బలమైన నాయకుడిపై ఒక సామాన్య మహిళ చేసిన పోరాటంగా గుర్తింపు పొందిందని, చాకలి ఐలమ్మ ధైర్యంతో అనేకమంది మహిళలు, ఉత్పత్తి కులాల వారు భూ పోరాటంలో భాగస్వాములయ్యారని, తెలంగాణ తొలి భూపోరాట వీరురాలిగా చాకలి ఐలమ్మ పేరు తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో లిఖితమైందని, చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన తర్వాత నిరాడంబర జీవితాన్ని గడిపి 1985, సెప్టెంబర్ 10 న మరణించారని, ఆమె జయంతి, వర్ధంతి లను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ తెలంగాణ అమరులను గుర్తు చేసుకునేలా ఘనంగా నిర్వహిస్తోందని" పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలంపల్లిలో ఘనంగా పోషణ్ మహా కార్యక్రమం హాజరైన జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి)**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషణ్ మాస్ ప్రోగ్రాంలో భాగంగా ప్రత్యేకంగా పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ ఈ సంవత్సరం సెప్టెంబర్ 9 వ తేదీ నుండి అక్టోబర్ 8 వ తేదీ వరకు పోషణ్ మాస్ కార్యక్రమాలను ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు మన అంగన్వాడి మన బాధ్యత" అనే భావనతో అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరైన పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. కేవలం పౌష్టికాహారమే కాకుండా,పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవశ్యకతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్, పోలంపల్లి గ్రామ సర్పంచ్ లావణ్య, నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ రవీందర్, సిడిపిఓ శ్రీలత, డాక్టర్ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్ పద్మ, హైస్కూల్ హెచ్ఎం, ఉప సర్పంచ్‌లు, పోషణ్ అభియాన్ డిసి ప్రమీల, బీసీ ప్రణీత, సఖి కవిత, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు,అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు, పిల్లలు, కిశోర బాలికలు తల్లులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**కరీంనగ ర్ టౌన్,సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):**

ధీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని ఆమె విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా చల్ల హరిశంకర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. మహిళా లోకానికి ఆమె పోరాట స్ఫూర్తి ఆదర్శంగా నిలిచిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

# మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి ప్రతీక వీర వనిత చాకలి ఐలమ్మ

## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ -26 ప్రజా జ్యోతి:**

వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తో కలిసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,,, చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలుగా, భూమి, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పేదలు, మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారు. అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శం" అని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి



స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని, అటువంటి వీర వనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఏ. రవీందర్, రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

---

# జీవితంపట్ల పాజిటివ్ దృక్పథం కలిగి ఉండాలి....

## - చదువే జీవితాన్ని మార్చుతుంది....

## ఇంటర్మీడియట్ విద్యాధికారి సిహెచ్ శరత్ కుమార్.....

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు జీవితంపట్ల సానుకూల దృక్పథం కలిగి ఉండాలి అని విధిని నిర్వర్తించడంతోపాటు బాధ్యత గుర్తెరగాలనీ, సాంకేతికంగా పరిజ్ఞానం పెంచుకోవడంతోపాటు నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాలనీ, మంచి మార్గంలో ప్రయాణం చేసి ఉన్నతులుగా రాణించాలని ముఖ్య అతిథి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సి. హెచ్. శరత్ కుమార్ గారు అన్నారు. సెప్టెంబర్ 26న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆహ్వానోత్సవం (ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి గారు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అతిథి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు సామాన్య, పేద కుటుంబాలకు చెందినవారని తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తున్నారనీ, చెడు అలవాట్లకు బానిసై జీవితాలను దుర్భరం చేసుకోవద్దని, విద్యార్థులు లక్ష్యం పెట్టుకుని ప్రణాలికతో శ్రమించి జీవితంలో విజయం సాధించాలన్నారు. తను వ్యవసాయ కుటుంబం నుండే వచ్చాననీ,చదువే జీవితాన్ని మార్చుతుందనీ, చదువును విడిచిపెట్టవద్దనీ అమ్మాయిలు కూడా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. విద్యార్థులు, యువత మత్తును వీడాలని, టిసేజీలో పక్కదారులు పట్టవద్దని కేసులు అయితే ఉద్యోగాలు రావని, జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. మార్కెట్ డిమాండ్ ను బట్టి చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి, డి.ఐ.ఇ.ఒ చెరుకు శరత్ కుమార్, సి.ఐ. వెంకటేష్ గారు, అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్, జ్యాతోతు శ్రీనివాస్, గజ్జెల గంగాధర్, అనుముల రవిచంద్ర, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా,నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.




---

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

## - మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి:**



వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని ఆమె విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి, పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని, అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన తెగువ నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆమె ఆశయాలను, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. యువత ఐలమ్మ జీవిత చరిత్రను తెలుసుకుని స్ఫూర్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, రజక సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

---

# క్రీసెంట్ ఉన్నత పాఠశాలలో..

# ..విద్యార్థులకు షీ టీమ్ అవగాహన

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి:**



రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని క్రీసెంట్ హైస్కూల్ విద్యార్థులకు మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్చార్జి ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరి నుంచైనా అసౌకర్యం కలిగించే ప్రవర్తన ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోక్సో చట్టం, సోషల్ మీడియా ప్రభావం, విద్యార్థుల ప్రవర్తన నియమాలు, మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు వివరించారు. మహిళల రక్షణ కోసం ప్రతిరోజూ బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, జనసమ్మర్ధ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదు చేసే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మహిళలకు ప్రమాదం లేదా బెదిరింపులు ఎదురైతే వెంటనే 100 లేదా 112కు ఫోన్ చేయాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930కు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు ప్రయాణ సమయంలో భద్రత కోసం టి-సేఫ్ యాప్ను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు మౌనిక, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

# మహనీయులను కీర్తించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే...

- మహనీయుల ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ సాధించుకున్నం
- ఎమ్మెల్యే దుద్దిళ్ల నేతృత్వంలోనే మహనీయులకు అవమానాలు - ఎన్ని ఆటంకాలు పెట్టినా మహనీయుల చరిత్రను చాటి చెప్తాం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):**

మహనీయుల స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మహనీయులను కీర్తించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాడు మహనీయుల ఉద్యమ స్ఫూర్తితో కేసీఆర్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన గుర్తు చేశారు. అనాడే ముందుచూపుతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో అర్టికల్ 3 పొందుపర్చారని, అంబేద్కర్ అర్టికల్ 3 రాసి ఉండకపోతే తెలంగాణ వచ్చేది కాదనే విషయాన్ని గమనించిన కేసీఆర్ ప్రపంచంలోనే 125అడుగుల అతిపెద్ద కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారని అన్నారు. మన బావితరాల గురించి వందల ఏండ్ల క్రితమే ఆలోచన చేసి పోరాటాలు చేసిన చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, కొమురంభీంలాంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని చాటుకుంటున్నామని, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారి విగ్రహాలను నెలకొల్పి స్మరించుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు నెహ్రూ, ఇందిరాగాంధీ పాలన నుంచి నేటి రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ పాలన వరకు మహనీయుల చరిత్రను తెలియకుండా చేసి అణిచివేస్తున్నారని ఆరోపించారు. ఈనాడు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఇక్కడి విగ్రహానికి మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం పూలు వేయకపోవడం మహనీయులను అవమానపర్చడమేనన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ నేతృత్వంలో మంథనిలో మహనీయుల చరిత్రను తెలియకుండా చేసి తన తండ్రినే మొక్కాలని చెప్తున్నాడని, మున్సిపల్ పాలకవర్గానికి సైతం మహనీయులు మీకు అవసరం లేదు మా తండ్రినే కొలువాలని చెప్పాడని ఆయన ఆరోపించారు. ఒకవైపు ప్రభుత్వ పరంగా మహనీయుల జయంతి వర్ధంతిలు జరుపుకుంటున్న క్రమంలొ మంథనిలో మాత్రం మహనీయులకు కనీస గౌరవం ఇవ్వకుండా తన తండ్రినే మొక్కమని చెప్తున్నాడని ఆయన విమర్శించారు. తన తండ్రి చరిత్ర ఏంటో చెప్పడం లేదన్నారు. మహనీయుల గురించి ఆలోచన చేయకుండా ఎమ్మెల్యే మాటలు విని స్థానిక పాలక వర్గం కనీసం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలు వేయకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాకలి ఐలమ్మను గొప్పగా గౌరవించుకుంటామని, ఎన్ని అంటకాంలు పెట్టినా వాళ్ల చరిత్రనే చాటి చెప్తామన్నారు. మహనీయుల విగ్రహాలు ఎక్కడ ఉన్నా గౌరవించాలనే కలెక్టర్ ఆలోచన చేయకపోవడం బాధకరమన్నారు. మంథని ఎమ్మెల్యే ఓట్ల కోసమే మా సమాజాన్ని వాడుకుంటున్నడే కానీ మహనీయులను గౌరవించడం లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఈనాడు చాకలి ఐలమ్మను గౌరవించకపోవడం చీకటి పాలన, చీకటి ఆలోచనకు నిదర్శనమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.





# మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## ఇందిరమ్మ చీరల పంపిణీలో ప్రభుత్వ విప్ విజయరమణ రావు

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి:**

మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడంతో పాటు వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి ఆర్ఆర్ గార్డెన్స్‌లో పెద్దపల్లి పట్టణ మహిళలకు ఇందిరమ్మ చీరలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలకు అండగా నిలుస్తూ కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మహిళా సంఘాల సౌకర్యార్థం రూ. 5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని నిర్మించామని, భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ బస్సులు, ఇందిరా మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారి ఆత్మగౌరవాన్ని మరింత పెంచే ఉద్దేశంతో నాణ్యమైన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# చాకలి ఐలమ్మఆశయాలను నేటితరంఆదర్శంగాతీసుకోవాలి

**వేములవాడ,సెప్టెంబర్,26:ప్రజాజ్యోతి.**

వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) 1895 సెప్టెంబర్ 26న వరంగల్ జిల్లాలోని కిష్టాపూర్ గ్రామంలో జన్మించారని తెలిపారు. సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా విసునూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి దోపిడీకి, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. భూమి, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆమె చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జీవితం మహిళా సాధికారతకు, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిందని, ఆమె ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ వద్దు.. భవిష్యత్తు ముద్దు

## - విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ రామ్మోహన్

**కొనరావుపేట,సెప్టెంబర్.26 (ప్రజాజ్యోతి)**

డ్రగ్స్ వద్దు.. భవిష్యత్తు ముద్దు మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కొనరావుపేట ఎస్ఐ బి. రామ్మోహన్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్. రాజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు నాశనమవుతాయని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కెరీర్ పై దృష్టి పెట్టాలని కోరారు. స్టూడెంట్ కౌన్సిలర్ బి. భూమేష్ డ్రగ్స్ డెమో ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

## ఆమె ఆశయాలు నేటి తరాలకు ఆదర్శం





**కొనరావుపేట,సెప్టెంబర్. 26 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు కొనరావుపేట మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు జింక కర్ణాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ సాగించిన ధైర్యసాహసాల పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. దొరల పెత్తనాన్ని, భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించి పేద రైతుల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగం తెలంగాణ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు. అణచివేతకు తలవంచకుండా అన్యాయాన్ని ప్రశ్నించిన ఐలమ్మ జీవితం మహిళా శక్తికి ప్రతీక అని, సామాజిక వివక్ష, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చూపిన తెగువ నేటి తరాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మస్కూరి కాశిరాం, కొనరావుపేట ప్యాక్స్ చైర్మన్ చేపూరి గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మానుక సత్యం, బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్యాక్స్ డైరెక్టర్లు, గ్రామ ప్రజలు, రజక సంఘం సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో అల్ఫోర్స్ విద్యార్థినికి ప్రథమ స్థానం

**కరీంనగర్ టౌన్,సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి)**

జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీల్లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని సి. నిత్యమహి ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ విజయంతో త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ పోటీలకు ఆమె అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిత్యమహిని అభినందించారు. విద్యార్థులు వివిధ రకాల పోటీ పరీక్షలు, పోటీల్లో తప్పనిసరిగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన సూచించారు. పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందేందుకు దోహదపడతాయని తెలిపారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. శిక్షణ అనంతరం ప్రతిభ కనబరిచే విద్యార్థులను ఉన్నతస్థాయి పోటీలకు ఎంపిక చేసి, విజయాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లా



కేంద్రంలోని సైన్స్ మ్యూజియంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో నిత్యమహి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించడం అభినందనీయమన్నారు. ఆమెకు మార్గదర్శకత్వం అందించిన గైడ్ టీచర్ దీప్తిని కూడా డాక్టర్ నరేందర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల సభను విజయవంతం చేయాలి

## కాంగ్రెస్ శ్రేణులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపు

**వేములవాడ,సెప్టెంబర్,26:ప్రజాజ్యోతి.**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ, ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో సీఎం పర్యటన ఏర్పాట్లు, జన సమీకరణపై ఆయన దిశానిర్దేశం చేశారు. వార్డుల వారీగా జన సమీకరణ బాధ్యతలు తీసుకున్న నాయకులు తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలను సభకు తరలించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. నిర్ణయించిన సంఖ్యకు అదనంగా మరో పది మంది వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. జన సమీకరణపై మండల, జిల్లా కమిటీలతోపాటు



రాష్ట్ర కమిటీ కూడా సమీక్షించే అవకాశం ఉందన్నారు. ప్రతి కార్యకర్త సభను విజయవంతం చేసే బాధ్యతను తీసుకోవాలని, వార్డుల వారీగా సమన్వయం చేసుకుని పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా రవాణా, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

# అక్టోబర్ 1న పెద్దపల్లిలో భారీ జాబ్ డ్రైవ్

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

## - నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ - 26 ప్రజా జ్యోతి;**

జిల్లా ఉపాధి శాఖ, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్ )రీజినల్ సెంటర్ సహకారంతో అక్టోబర్ 1న గురువారం రోజున పెద్దపల్లిలో భారీ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి బస్సు డిపో సమీపంలోని టాస్క్ సెంటర్ ప్రాంగణంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ, ఆసక్తిగల యువతీ, యువకులు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.ఈ జాబ్ డ్రైవ్‌లో పలు ప్రముఖ కంపెనీలకు చెందిన ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని,

ఎల్.ఎన్. గ్రూప్ కంపెనీ:
అసెంబ్లీ ఆపరేటర్లు,
రేడియంట్ కంపెనీ: రిలేషన్‌షిప్ మేనేజర్,
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్: బ్యాంకింగ్ అసోసియేట్,
డి-మార్ట్ సంస్థ: క్యాషియర్, ప్రమోటర్స్
నీమ్యాన్స్ సంస్థ: సేల్స్ ప్రమోటర్స్,

వీటితో పాటు డేటా అనలిస్ట్ కోర్సులో ఉచిత ట్రైనింగ్ , ప్లేస్‌మెంట్ కూడా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు కనీస వేతనం రూ. 18,000 నుండి రూ. 45,000 వరకు ఉంటుందని, నిరుద్యోగ యువతీ, యువకులు



ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు నూతన రెజ్యూమ్, తగిన గుర్తింపు పత్రాలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విబేధాలు వీడి సమన్వయంతో పని చేయండి

## పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టండి - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి):-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేయాలని కవ్వంపల్లి సూచించారు. గ్రామాల అభివృద్ధే సర్పంచుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజీవ్ మల్హోత్ర అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టే ముందు ఆయా పంచాయతీల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కేవలం ఆర్భాటం కోసం పనులు చేపట్టి భవిష్యత్తులో పంచాయతీలపై ఆర్థిక భారం పడేలా చేయవద్దన్నారు.గతంలో కొందరు సర్పంచులు హంగులు, ఆర్భాటాల కోసం చేపట్టిన పనుల నిర్వహణ ప్రస్తుతం కొత్తగా బాధ్యతలు చేపట్టిన సర్పంచులకు భారంగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు.

### పాఠశాలలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తొలి విడతలో మానకొండూర్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా స్కూల్ మంజూరైందని, తిమ్మాపూర్ మండల పరిధిలోని యాదవులపల్లిలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పనితీరును మెరుగుపర్చేందుకు సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సర్పంచులు తరచూ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు, మౌలిక వసతుల పరిస్థితి,



పాఠశాల నిర్వహణపై ఆరా తీయాలని అన్నారు. సమస్యలను గుర్తించడంతో పాటు వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సిబ్బందిపై పర్యవేక్షణ బాధ్యత సర్పంచులదేగ్రామ పంచాయతీ సిబ్బంది పనితీరుపై సర్పంచులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచించారు. సిబ్బంది తమకు అప్పగించిన విధులను సక్రమంగానిర్వహిస్తున్నారా లేదా అన్నది రోజువారీగా పరిశీలించాలన్నారు.గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల పరిశుభ్రత, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.సమావేశంలో తిమ్మాపూర్ మండల తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్, ఏపీఎం సంపత్, పంచాయతీరాజ్ ఏఈ స్నేహజ్యోతి, ట్రాన్స్‌కో ఏఈ ఖాసీం, నుస్తులాపూర్ ప్యాక్స్ చైర్మన్ గోపు మల్లారెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.45 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు తిమ్మాపూర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.తిమ్మాపూర్ మండలంలోని అల్గునూరు, కొత్తపల్లి, మల్లాపూర్, మన్నెంపల్లి, మొగిలిపాలెం, నల్లగొండ, నేదునూరు, నుస్తులాపూర్, పర్లపల్లి, పోలంపల్లి, పోరండ్ల, రేణికుంట, తిమ్మాపూర్, వచ్చునూరు గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

# వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లోకేష్ మున్సిపల్ వార్డ్ అధికారులతో సమీక్ష సమావేశం

## - మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు.

**వేములవాడ,సెప్టెంబర్,26:ప్రజాజ్యోతి.**

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతూ నిరుపేద కుటుంబాల సొంతింటి కల ను నెరవేర్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గౌరవ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ సహకారం తో వేములవాడ పట్టణంలో రెండో విడతలో మంజూరైన 532 ఇండ్ల వెరిఫికేషన్ ప్రాసెస్ ను అధికారులు తొందరగా పూర్తి చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రొసీడింగ్ పత్రాలను అందించాలని కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళను తొందరగా మార్కౌట్ చేయవలసిందిగా వార్డ్ అధికారులకు తెలియజేశారు, అలాగే పర్యావరణహితమైన వేములవాడ కోసం పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు వార్డ్ అధికారులు అవగాహన కల్పించాలని పట్టణంలోని వ్యాపారస్తులు హోటల్స్ యజమానులు,కూరగాయలు విక్రయించేవారు ఫంక్షన్ హాల్స్ నిర్వాహకులు నిషేధిత ప్లాస్టిక్ ను వినియోగించవద్దని వాటి స్థానంలో పర్యావరణహితమైన క్లాత్ బ్యాగులు ఇతర ప్రత్యామ్నాయలను ఉపయోగించాలని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవడంతో పాటు భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని వారన్నారు.ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ రాజమోహన్,ఇందిరమ్మ ఇండ్ల గెజిటెడ్ ఆఫీసర్స్ సురేష్, సదానందం,మేనేజర్ సంపత్ రెడ్డి,మున్సిపల్ వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



# సత్వరన్యాయం జరిగినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు

**వేములవాడ,సెప్టెంబర్,26:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, నిందితుడు కోరేపు రాజ్‌కుమార్‌కు గౌరవ న్యాయస్థానం జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ.10,000/- జరిమానా విధించిన నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు పోలీస్ వ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు.తమ కుటుంబానికి న్యాయం జరిగేలా కేసు దర్యాప్తులో సమర్థవంతంగా కృషి చేసిన జిల్లా ఎస్పీ గారికి, పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ బాధిత కుటుంబ సభ్యులు వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



## రెడ్‌క్రాస్ జిల్లా శాఖకు నూతన కార్యవర్గం - చైర్మన్గా ఎరబాటి వెంకటేశ్వరరావు

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి:**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా శాఖకు నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో వివిధ హోదాలకు సభ్యులను ఎన్నుకోగా, ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ముస్త్యాల రాజశేఖర్ ప్రకటించారు.చైర్మన్‌గా ఎరబాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా సాదుల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పంపాటి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా కావేటి రాజగోపాల్ ఎన్నికయ్యారు.జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఉప్పు రాజ్‌కుమార్, గంట్ల రామచంద్రరెడ్డి, మహమ్మద్ అబ్దుల్ మోయిద్, మెడగోని వెంకటేష్, అల్వారి సంపత్‌రావు, వేల్పుల రమేష్, గూళ్ల అంజన్‌కుమార్, దుదం వెంకట సాంబమూర్తి ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గం రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలు అందించడంతో పాటు విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో సహాయక కార్యక్రమాలను నిర్వహించనుంది. ఎన్నికైన కమిటీ, కార్యనిర్వాహకుల పదవీకాలం ఎన్నిక జరిగిన తేదీ నుంచి మూడేళ్ల పాటు కొనసాగనుంది. ఈ మేరకు పదవీకాలం 2029 అక్టోబర్ 5తో ముగియనుంది.ఎన్నికల వివరాలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి, సీఈఓకు సమాచారం కోసం పంపినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.



## చాకలి ఐలమ్మకు ఘన నివాళి

**కరీంనగర్, సెప్టెంబర్ 26,(ప్రజాజ్యోతి):**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు.సీపీ గౌష్ ఆలం, ఐపీఎస్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూమి, భుక్తి,వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం ఆదర్శనీయమని, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్ఐ కిరణ్‌కుమార్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## దళిత యువకుడిపై విచక్షణారహిత దాడి కారులో తీసుకెళ్లి నగ్నంగా ఉంచి కర్రలు, రాళ్లతో దాడి..

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):**

సుల్తానాబాద్ పట్టణంలో దళిత యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన కలకలం రేపింది. యువకుడిని కారులో ఎక్కించుకుని పట్టణ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి నగ్నంగా ఉంచి కర్రలు,





రాళ్లతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. పూసాల రోడ్డుకు చెందిన చిలుక ఉదయ్ గత పదేళ్లుగా పట్టణంలోని నందిని కన్‌ఫ్యాక్షనరీలో కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో కొందరు వ్యక్తులు ఉదయ్‌ను కారులో ఎక్కించుకుని నీరుకుల్ల శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ ఉదయ్ బట్టలు విప్పించి నగ్నంగా ఉంచి కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఉదయ్ తీవ్రంగా గాయపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఘటన అనంతరం బాధితుడి అన్న చిలుక శ్రీకాంత్ సుల్తానాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

## జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థి

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి:**

టెన్నిస్ బాల్ క్రికెట్‌లో స్థానిక రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి ముమీజుద్దీన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. టెన్నిస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 28న హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో అండర్-17 విభాగంలో నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముమీజుద్దీన్‌ను ఈ నెల 27, 28 తేదీల్లో గుంటూరులో జరిగే జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు హకీమ్ ఖాన్, పీఈటీ తగురం తిరుపతితో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలతో పాటు పెద్దపల్లి జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




## సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషి చేస్తా

కుక్కలు. కోతుల బెడద నుండి కాపాడాలంటూ పలువురు

.సర్పంచులు పెద్దపల్లి జిల్లా కలెక్టర్. కోయ శ్రీ హర్ష కు మొర.

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

గ్రామాల్లో గల ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ. మండల అభివృద్ధికి పాటు పడతానని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం రోజున సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచ్లను గ్రామాల్లో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు తెలిపిన సమస్యలను కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష నోట్ చేసుకున్నారు. భూ సమస్యల పరిష్కారంతోపాటు. నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నీటి సమస్యను పరిష్క రించదున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు ఇవ్వనున్నట్టు ఆయన పేర్కొన్నారు. వాటిని స్థితిగతులను ఏఈని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వీధి కుక్క లు. కోతుల బెడద భయంకరంగా మారిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో. ప్రత్యేక అధికారి శ్రీ మాల. తహసిల్దార్ డాక్టర్ రాపల్లి రాముడు .ఎంపీడీవో సురేందర్ కుమార్. సూపర్డెంట్ శ్రీధర్. విద్యుత్ ఏఈ. శ్రీనివాస్. ఏపిఎం లవకుమార్. ఏపీఓ మంజుల. డాక్టర్ శ్రీనివాస్. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కోర్నాల్. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి. వివిధ శాఖల అధికారులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# అధికార సిబ్బందికి ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ పాలకవర్గం ఘన సన్మానించారు

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సర్పంచి ఎలగందుల నర్సింలు గ్రామపంచాయతీ పాలకవర్గంఎల్లారెడ్డిపేట గ్రామంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేందుకు సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, సెస్ సిబ్బందిని ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా జరిగేలా కృషి చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ , ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేష్ గౌడ్ , కానిస్టేబుళ్లు సతీష్, చందు, సెస్ సిబ్బంది లక్ష్మీరాజం, వెంకటేష్, దాసు తదితరులను ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎలగందుల నరసింహులు, ఉప సర్పంచ్ బంధారపు బాల్ రెడ్డి మరియు ఈవో కృష్ణ పాలకవర్గ సభ్యుల సమక్షంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గణేష్ నిమజ్జన



కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ, సెస్ సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమని తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడుతూ నిమజ్జన కార్యక్రమాలను విజయ వంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడొద్దంటూ దుకాణదారులకు నోటీసులు

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని. దుకాణదారులు. ప్లాస్టిక్ కవర్లు వాడొద్దంటూ. గ్రామపంచాయతీ తీర్మానం మేరకు. దుకాణ దారులకు.నోటీసుల ను. శనివారం రోజున అందజేశారు. నిబంధ నలను ఉల్లంఘించి ప్లాస్టిక్ ను వాడినట్లయితే .పదివేల రూపాయలు జరిమాన విధించనున్నట్లు వారు నోటీసులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అశోక్. గ్రామపంచాయతీ సిబ్బంది. తదితరులు ఉన్నారు.



# కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్ర. ముదిరాజ్ కుల సంఘం ఏకాగ్రీవ ఎన్నిక

**- అధ్యక్షులుగా కారు పాకల కృష్ణ.**

క్యాషియర్ గా చిలువేరు రమేష్ ఎన్నిక. కాల్వ శ్రీరాంపూర్ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన, ముదిరాజ్ కుల సంఘం ఎన్నిక శనివారం రోజున జరిగింది .అధ్యక్షులుగా కారుపాకల కృష్ణ. క్యాషియర్ గా చిలువేరి రమేష్ లను. ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు .మా ఎన్నికలకు సహకరించిన ముదిరాజ్ కులస్తులందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.



# పశుసంపదకు బీమాతో పశుపోషకులకు ఆర్థిక భరోసా

**- గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగ మహేందర్ యాదవ్**

**ధర్మారం,సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి న్యూస్):**

పాడి రైతులు,గొర్రెలు,మేకల పెంపకందారులను ప్రోత్సహించేందుకు పశుసంపదకు బీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగ మహేందర్ యాదవ్ అన్నారు.కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ద్వారా ఈ బీమా పథకాన్ని అమలు చేయడం వల్ల పశుపోషకులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.మొత్తం బీమా ప్రీమియంలో 85 శాతం సంస్థ భరించగా,15 శాతం లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గొర్రెలు,మేకలు విషపూరిత ఆహారం తీసుకోవడం, వివిధ వ్యాధులతో మృతి చెందడం వంటి కారణాలతో పెంపకందారులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో బీమా సౌకర్యం పశుపోషకులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జంగ మహేందర్ యాదవ్ కోరారు.పశు సంపదకు బీమా సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గొర్రెల మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ సుబ్బరాయుడులకు గొర్రెలు,మేకల పెంపకందారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.



# చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**సుల్తానాబాద్ సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన ధీరవనిత చిట్యాల చాకలి ఐలమ్మ 31వ జయంతి వేడుకలను శనివారం సుల్తానాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి, మానసిక వికలాంగుల సంరక్షణ కేంద్రంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మానసిక వికలాంగుల సంరక్షణ కేంద్రంలోని చిన్నారులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజాసేవలో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఓట్ల వరప్రదీప్, గాదాసు మంజుల రవీందర్, గరిగే శోభారాణి, శ్రీనివాస్, కందునూరి సమత కుమార్,సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు నిటూరి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మైసయ్య, దీపక్, రాజు, నీరజ్, నిఖిల్, సాయి, సతీష్, హనీ, బబ్బులు, చాతల శివ తదితరులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, రజక సంఘం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పిడుగుపాటు మృతురాలి కుటుంబానికి యాదవ సంఘం ఆర్థిక చేయూత

**ధర్మారం, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి న్యూస్):**

ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన మారం అంజవ్వ ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందగా, విషయం తెలుసుకున్న జిల్లా, రాష్ట్ర యాదవ సంఘం నాయకులు శనివారం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతురాలి కుటుంబానికి రూ.14,500 ఆర్థిక సాయం అందజేశారు.ఓదెల మండల మాజీ జెడ్పీటీసీ గంట రాములు యాదవ్ రూ.5,000/యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మలేషం యాదవ్ రూ.2,500/జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధినేని రాజేందర్ యాదవ్ రూ.2,500/జిల్లా ప్రధాన కార్యదర్శి పెగడ రమేష్ యాదవ్ రూ.2,500, రామన్న స్నేహితుడు పెరక శ్రీను రూ.2,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సంగ రంజిత్ యాదవ్,యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దారవేణి నరసింహ యాదవ్,సర్పంచ్ రవి యాదవ్, మాజీ సర్పంచ్ సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన యాదవ సంఘం నాయకులకు కుటుంబ సభ్యుల తరపున, గ్రామ ప్రజల తరపున చామనపల్లి సర్పంచ్, యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల రేవతి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టై,బెల్టుల పంపిణీ

## కొయ్యడ రవీందర్ రెండు వేలు విరాళం

**ధర్మారం, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి న్యూస్):**

ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు టై,బెల్టులు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన బెల్టులను, స్థానిక నాయకుడు కొయ్యడ రవీందర్ రూ.2 వేల విరాళంతో సమకూర్చిన టైలను గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణీ హరీష్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతో పాటు దాతల సహకారంతో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ప్రభుత్వం త్వరలో విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువులో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న, ఉపాధ్యాయులు అనుమల్ల శారద, విద్యా వాలంటీర్ నాగెల్లి సౌజన్య, నాయకులు మాందాల హరీష్, కొయ్యడ రవీందర్, పల్లెర్ల అరుంధతి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## సామాజిక సేవతో పుట్టినరోజు వేడుకలు ఆదర్శనీయం - మంథని సీఐ బుద్దే స్వామి

**మంథని, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):**

పుట్టినరోజు వేడుకలను కేక్ కటింగ్‌లు, ఆర్భాటాలకు పరిమితం చేయకుండా నిరుపేదలకు అండగా నిలిచేలా నిర్వహించడం అభినందనీయమని మంథని సీఐ బుద్దే స్వామి అన్నారు. మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన తాటి విజయ్ కుమార స్వామి నిహారిక దంపతులు తమ కుమారుడు తాటి సాయివర్ధన్ (టిల్లు) పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తాటి సాయివర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన ఐదు నిరుపేద కుటుంబాలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు. మంథని సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ సందీప్ కుమార్ తమ చేతుల మీదుగా లబ్ధిదారులకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ సందీప్ కుమార్ లు మాట్లాడుతూ సమాజంలో కష్టాల్లో ఉన్న నిరుపేదలను ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. పుట్టినరోజు వంటి ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజానికి మంచి సందేశం అందుతుందన్నారు. సాయివర్ధన్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాయివర్ధన్ తండ్రి తాటి విజయ్ కుమార స్వామి మాట్లాడుతూ తమ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు సహాయం చేయడం ద్వారా లభించే తృప్తి ఎంతో ప్రత్యేకమైనదన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచినంత మేర పేదలకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.




### సామాజిక సేవలో ముందుండే విజయ్ కుమార స్వామి

తాటి విజయ్ కుమార స్వామి మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తూ తన వంతుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. యువతకు, సమాజానికి ఉపయోగపడే సందేశాలను అందించే విధంగా వివిధ రకాల సామాజిక అవగాహన రీల్స్ రూపొందిస్తూ ప్రజలకు చేరువవుతున్నారు. సామాజిక ప్రయోజనంతో కూడిన ఆయన రీల్స్‌కు పలువురు అభిమానులు, యువత నుంచి అభినందనలు లభిస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో తన కుమారుడి పుట్టినరోజును కూడా సేవా కార్యక్రమంగా నిర్వహించడం పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో యువకులు, పోలీసు సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొని సాయివర్ధన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన తాటి విజయ్ కుమార స్వామినిహారిక దంపతులను అభినందించారు.

# సీఎం రాకకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు 30న నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం

## - భద్రత, ప్రోటోకాల్, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి - కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి)**

ఈ నెల 30న కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సీపీ గౌష్ ఆలం, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులతో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పర్యటన ఏర్పాట్లపై విస్తృతంగా సమీక్షించారు.

### ప్రతి అంశంపై ముందస్తు ప్రణాళిక

ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకుని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వీఐపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు పూర్తిచేయడంతో పాటు కార్యక్రమ ప్రాంగణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, మైక్ సిస్టమ్, ప్రెస్ గ్యాలరీ తదితర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమం రాష్ట్రంలోనే ఒక మోడల్‌గా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నోడల్ అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.




### భద్రతపై ప్రత్యేక దృష్టి

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే వీఐపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు సంబంధించి ప్రోటోకాల్ నిబంధనలను పాటిస్తూ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రవేశ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజలు గుమిగూడే ప్రాంతాల్లో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని పోలీసు, ఇతర విభాగాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, రాకపోకలపై ముందస్తు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత విభాగాలు పరస్పర సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను కూడా అధికారులు సమీక్షించారు. విగ్రహావిష్కరణ, ఇతర అధికారిక కార్యక్రమాలకు అనుగుణంగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. అలంకరణ, విద్యుత్ ఏర్పాట్లు, మైక్ సిస్టమ్, లైటింగ్ తదితర అంశాలను ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాన్ని కవర్ చేసే మీడియా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రెస్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మీడియా ప్రతినిధుల సీటింగ్, సమాచార సేకరణకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కార్యక్రమాన్ని సజావుగా కవర్ చేసేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.



### నోడల్ అధికారులపై ప్రత్యేక బాధ్యత

కలెక్టరేట్‌లో జరిగిన సమావేశం అనంతరం జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లతో మరోసారి ప్రత్యేక సమావేశం నిర్వహించి సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్షించారు. ప్రతి విభాగానికి అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతి, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. నోడల్ అధికారులు తమ పరిధిలోని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా లోపాలు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ డిఆర్ఓ స్వామి ఆర్డీవోలు షర్మిల, జల కుమారి పోలీస్ అధికారులు జిల్లా స్థాయి అధికారులు తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

## ఐలమ్మ స్ఫూర్తితో రజకుల సంక్షేమానికి కృషి చేయాలి

**ముస్తాబాద్, సెప్టెంబర్ 26: (ప్రజా జ్యోతి):**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు ముస్తాబాద్ మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షులు సుద్దాల దేవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముస్తాబాద్ ఎస్సై జ్యోతి హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తెలంగాణ ప్రజల ధైర్యసాహసాలను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఆమె త్యాగం, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొంటూ, రజక వృత్తిదారుల సంక్షేమం కోసం మరిన్ని సంక్షేమ పథకాలు, ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రజకుల అభ్యున్నతికి సంఘటితంగా కృషి చేయాలని



నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ సర్పంచ్, ఎస్సై జ్యోతి, వివిధ గ్రామాల రజక సంఘాల అధ్యక్షులు, మండల రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, యువకులు, రజక సంఘం సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు పిల్లలకు ప్రతిరోజు సమయం ఇవ్వాలి

## - పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తల్లిదండ్రులదే ముఖ్య పాత్ర

## - ప్రముఖ సైకాలజిస్ట్ డా. అడ్డిగ శ్రీనివాస్

## - విస్డం స్కూల్ ఆధ్వర్యంలో "హ్యాపీ పేరెంటింగ్" కార్యక్రమం





**రాయికల్ సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

పట్టణంలోని విస్డం హైస్కూల్ ఆధ్వర్యంలో 21వ శతాబ్దంలో పిల్లల పెంపకం తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలగు అంశాల గురించి "హ్యాపీ పేరెంటింగ్" అనే కార్యక్రమాన్ని శివాజీ రెడ్డి గార్డెన్లో 700 మంది తల్లిదండ్రులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లైఫ్ స్కిల్ పేరెంటింగ్ కోచ్ డాక్టర్ అడ్డిగ శ్రీనివాస్ మాట్లాడుతూ పోషకులు టైం, టచ్, ట్రస్ట్, టాక్ లాంటి నాలుగు టీలను పాటించాలని, పిల్లలను తప్పు పట్టకుండా వారు చేసే తప్పులు మాత్రమే సవరించాలి అని పిల్లవాడు మారడంలో 80% తల్లిదండ్రులదే కారణం ఉంటుందని తెలిపారు. పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తల్లిదండ్రుల బాధ్యతే ప్రముఖంగా ఉంటుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వాంగీన వికాసంలో భాగంగా మానసిక తరగతులు వికాస తరగతులు లైఫ్ స్కిల్ తరగతులు కూడా నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే పోషకులకు కూడా ప్రత్యేకంగా పేరెంటింగ్ తరగతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ప్రముఖ సైకాలజిస్టులచే నెలకు ఒకసారి విద్యార్థులకు, మూడు నెలలకు ఉపాధ్యాయులకు, 6 నెలలకు ఒకసారి తల్లిదండ్రులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నివేదితారెడ్డి, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నాణ్యతలను పరిశీలించిన హౌసింగ్ ఏఈ



**మేడిపల్లి, సెప్టెంబర్ 26 ప్రజాజ్యోతి**

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను హౌసింగ్ ఏఈ హర్షిత, గ్రామపంచాయతీ కార్యదర్శి ఇళయ చంద్ర లు శనివారం రోజున సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ హర్షిత మాట్లాడుతూ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అదేవిధంగా అక్టోబర్ నెల 1 నుంచి ప్రభుత్వం జారీచేసిన నూతన నిబంధనలు అమల్లోకి వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగ్గిల రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం పోరాడిన వీరవనిత ఐలమ్మ

## - అడ్వకేట్ అకారి రాజేశం

**ధర్మారం, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి న్యూస్):**

చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని నంది మేడారం అడ్వకేట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ,లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు అకారి రాజేశం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అకారి రాజేశం మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలకు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత చాకలి ఐలమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మారం గ్రామపంచాయతీ కార్యదర్శి ఎడపెల్లి సంతోష్,సల్వాజి మాధవరావు, అర్ధవెల్లి రాము, అమరపెల్లి నారాయణ, దేవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# ఒడ్యాడ్‌లో ఘనంగా పోషణ మాస ఉత్సవం

**భీమారం, సెప్టెంబర్ 26:**

భీమారం మండలం ఒడ్యాడ్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి సలహాల మేరకు సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ అధ్యక్షతన 9వ పోషణ మాస ఉత్సవం, ఈసీసీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా పిల్లలు ఇంటి వద్ద కాకుండా బడిలో ఉండేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. పోషకాహార లోపం లేని గ్రామంగా ఒడ్యాడ్‌ను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంతెన భారతి రాజేందర్, ఉపాధ్యాయులు మురళి, ధనలక్ష్మి, ప్రశాంతి రేఖ, ఏఎన్ఎంలు సరస్వతి, సబిత, ఆశా కార్యకర్త జమున, అంగన్వాడీ టీచర్ పుర్రె భావమ్మ, ఆయమ్మ నాంచారి లక్ష్మీ, తల్లులు, పిల్లలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# భూపతిపూర్ 3 వ అంగన్వాడీ కేంద్రంలో పోషణమాస కార్యక్రమం

**రాయికల్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

మండలంలోని భూపతిపూర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం రోజున పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని అంగన్వాడీ టీచర్ మామిడాల సుమలత అన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు (మిల్లెట్స్), మొలకెత్తిన గింజలు, గుడ్లతో ప్రత్యేక ఆహార పదార్థాల గురించి అవగాహనా కల్పించారు. ఏయే ఆహార పదార్థాల్లో ఎలాంటి విటమిన్లు, పోషకాలు ఉంటాయో తల్లులకు వివరించారు. అనంతరం గర్భిణీలకు సీమంతం, పిల్లలకు అన్న ప్రాసన చేశారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథి మండల విద్యాధికారి రాఘవులు,సర్పంచ్ గుర్రం భావన -మహేందర్ కార్యదర్శి ఆదిత్య రాజ్,అంగన్వాడీ టీచర్స్ సుమలత, కవిత ఆశా కార్యకర్తలు వివోలు, సీపీస్ స్కూల్ టీచర్స్,గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.



# మోత్కురావుపేట లో పోషకాహారంపై అవగాహన

**భీమారం, సెప్టెంబర్ 26: (ప్రజాజ్యోతి)**

జాతీయ పోషణ మాసం సందర్భంగా భీమారం మండలం మోత్కురావుపేట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఎనుగుల లచ్చయ్య అధ్యక్షతన పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం తదితర పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉప్పు, చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించాలని, తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే గ్రామం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఆరు నెలలు నిండిన చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పైని మాథ్యూ, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, వెంకటేష్, నరసింహారెడ్డి, మహేష్, పోగుల మల్లేశం, మల్లేశం, వీఓఏ సునీత, అంగన్వాడీ టీచర్ లక్ష్మి, తల్లులు తదితరులు పాల్గొన్నారు.





# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సీడీపీఓ పద్మ

## - 21 అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల్లో అనుకూలంగా వ్యవహరిస్తానంటూ రూ.63 వేల డిమాండ్

## లంచం స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

**మెట్‌పల్లి, సెప్టెంబర్ 26 ప్రజాజ్యోతి**

జగిత్యాల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన ట్రాప్‌లో సీడీపీఓ పద్మ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మెట్‌పల్లి పట్టణ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలకు సంబంధించి లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణ సెక్టార్ పరిధిలోని 21 అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సందర్భంగా ప్రతికూల వ్యాఖ్యలు నమోదు చేయకుండా, అనుకూలంగా వ్యవహరించేందుకు ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నుంచి నెలకు రూ.1,000 చొప్పున మూడు నెలలకు రూ.3,000 చెల్లించాలని సీడీపీఓ పద్మ డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందింది.21 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి మూడు నెలలకు ఒక్కో కేంద్రం నుంచి రూ.3,000 చొప్పున మొత్తం రూ.63,000 లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

### - రూ.63 వేల లంచంతో ఏసీబీ ట్రాప్

ఫిర్యాదుదారుడి నుంచి లంచం స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించారు. సెప్టెంబర్ 26న కార్యాలయ ఆవరణ వెలుపల రూ.63,000 లంచం స్వీకరిస్తుండగా సీడీపీఓ పద్మను ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు.లంచంగా స్వీకరించిన రూ.63,000 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీడీపీఓ పద్మను



అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

### - ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు

ట్రాప్ అనంతరం నిందితురాలిపై సంబంధిత అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి తదుపరి న్యాయపరమైన చర్యలు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. సీడీపీఓ పద్మను కరీంనగర్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ ఘటనతో మెట్‌పల్లి పట్టణ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలకంగా పనిచేసే అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన తనిఖీల్లో లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ప్లాస్టిక్‌కు స్వస్తి.. స్టీల్ గ్లాసుల వినియోగం ముద్దు

# హోటల్ యజమానులకు 100 స్టీల్ గ్లాసుల పంపిణీ





**రాయికల్, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి)**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎన్విరాన్మెంట్ వీక్ సందర్భంగా లయన్స్ క్లబ్ రాయికల్ ఆధ్వర్యంలో హోటల్ యజమానులకు స్టీల్ గ్లాసుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ గ్లాసుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో 100 స్టీల్ గ్లాసులను హోటల్ యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వాసం ప్రసాద్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. హోటళ్లలో ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ కనపర్తి శ్రీనివాస్, ట్రెజరర్ లయన్ సుధావేణి మురళి గౌడ్, బత్తిని భూమయ్య, దాసరి గంగాధర్, మచ్చ శేఖర్, వాసం స్వామి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, సంకోజి అశోక్, సామల సత్యనారాయణ, ఆడెపు రాంప్రసాద్, పారి పెల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రైతు దినోత్సవం

**మల్లాపూర్: సెప్టెంబర్ 26 ప్రజాజ్యోతి**



మండలంలోని వాల్గొండ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవ వేడుకలను భారతీయ కిసాన్ సంఘ్ మల్లాపూర్ మండల ఉపాధ్యక్షులు క్యాతం రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ ప్రగతికి అన్నదాతలే వెన్నెముక అని నాయకులు కొనియాడారు. రైతుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి భారతీయ కిసాన్ సంఘ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గడ్డం మహేందర్, దండ వేణి లక్ష్మణ్, కోట రమేష్, అన్నపురం శ్రీనివాస్, పనస స్వామి తదితరులు పాల్గొన్నారు.